


దోమా కలాపం

సైజుల్ని బట్టి శక్తి సామర్థ్యాలు అంచనా వేయడం పొరపాటు. ఏనుగు, దోమల్లో ఏది చిన్నదో, ఏది పెద్దదో మనకి తెలుసు. అందుచేతనే ఏనుగెక్కడ? దోమ ఎక్కడ? ఏనుగు ఏనుగే ఆఫ్టరాల్ దోమ దోమే నంటూ సైజుని దృష్టిలో వుంచుకొని మనవాళ్ళు ఏనుగుకి స్థానమిచ్చి, దోమని తీసి పారేసేరు. నన్నడుగుతే సైజులూ, కాలతలతో ఘనాపాటి తనాన్ని లెక్కకట్టగూడ దంటాను. ఎంత పెద్ద జంతువైనా ఏనుగు పాపం వుత్త అమాయకపు ముండని చెబుతాను. శరీరం పెద్ద పర్వతమే అయినా గుండెమాత్రం బహు చిన్నది. అందుకే అది మనిషికి లొంగిపోయింది. దాని కాళ్ళట్టుకునో, బతిమాలో బామాలో దాన్ని లొంగదీసుకొంటున్నాడు మనిషి.

అంకుశం చేతిలో వుంటే గడగడా వణికి ఛస్తుంది. చెప్పినట్టల్లా బుద్ధిగా వింటుంది. దాసోహమంటుంది. మనిషికి సేవలు చేస్తుంది. మీద నెక్కించుకుని వూరేగిస్తుంది. యుద్ధాల్లో సాయం చేస్తుంది. సినిమాల్లో పిల్లల్ని పెంచి హీరోల్ని చేస్తుంది. కన్నతల్లిలా ఆదుకుంటుంది.

దోమ సంగతి అట్లాకాదు. సైజులో అదెంత చిన్న దుండో, దుర్మార్గంలో అదంత జగమొండి. దానికాళ్ళమీద పడిపోయి రాజీ చేసుకుందామంటే కాళ్ళు కనపడవు. ఆ మాటకొస్తే వెలుగు లేకపోతే దోమే కనపడదు. చెవి దగ్గర చేరిపోయి గీ పెడుతుంది. చేతితో కొట్టబోతే తప్పించుకుంటుంది. ఆ దెబ్బ మనకే తగిలి మంట పెడుతుంది. మనల్ని అల్లరి పెట్టడానికి ఒక్క దోమ చాలు. అలాంటిది దోమలమంద వందల సంఖ్యలో దాడి చేస్తే, ఆ మానవుడికి పిచ్చెక్కుతుంది. గీ పెట్టి వెళ్ళిపోతే బాగుండిపోను. కుడుతుంది. పచ్చి నెత్తురు తాగుతుంది. ఆ నెత్తురు బాగుంటే క్షణాల మీద కబురంపి తన గుంపుని పిలుస్తుంది, గుంపు వచ్చి మీద పడిందంటే ఆ మనిషి లబో దిబోమని అల్లాడి పోవాల్సిందే తప్ప వేరే పరిష్కారమార్గం దొరకదు.

ప్రహ్లాదుడ్ని భయపెట్టడానికి ఏనుగు చేత తొక్కించే ప్రయత్నం చేసేడు హిరణ్యకశిపుడు. చెబితినే! ఏనుగు గుండె చాలా అల్పమని....అందుచేత ఏనుగు ప్రహ్లాదుణ్ని ఏమీ చేయలేక పోయింది. శ్రీహరి అనగానే అమ్మ బాబోయ్ అంటూ దౌడు తీసింది. అట్లా గాకుండా ప్రహ్లాదుణ్ని దోమలున్న గదిలో గంట కూచోబెడితే అతని తిక్క కుదరేది. శ్రీహరీ అన్నా నారాయణ అన్నా దోమ వినిపించుకోదు. దేవుడూ, దెయ్యాలపట్ల దోమకి భయభక్తుల్లేవు. ఇష్టమొచ్చినట్టు యాగీచేసేది. దెబ్బకి ప్రహ్లాదుడుదారికొచ్చి, నాన్నా! నువ్వే దేవుడవని అంగీకరించేవాడు. అంతెందుకు....అలనాడు రాయలవారి దర్బారులో "కుంజర యూధంబు దోమ కుత్తుక జొచ్చెన్"అనే సమస్య పలువుర్ని కలవర పెట్టింది. ఎంతకీ సైజు చూసి బెదరే వారే కానీ ఆ సమస్యను

పూరించే మార్గమేమిటో ఎవరికి తోచదు. రామలింగ కవికి హీటెక్కిపోయింది. ఆ సమస్య యిచ్చినందుకు యిచ్చిన వాణ్ణి లంజల కొడకాంటూ తిట్టిపోస్తూ ఒక పద్యం చెప్పేడు సమస్యా పూరణం జయప్రదంగా జరక్కపోతే పరువులు పోతాయని పాండవుల్ని ఏనుగుల్ని చేసి విధివశాత్తు ఆ ఏనుగులు దోమ నోట్లో చిక్కుకున్నాయని కవిత్వం చదివి భేషనిపించుకున్నాడు. ఇంత అవస్థ పడకుండా దోమ తలచుకుంటే ఏనుగేమిటి? దాని బాబుని కూడా మింగేయగలదని ధైర్యంగా ఒక్క ముక్క చదివివుంటే సరిపోయేది. ఆ రోజులలో దోమలకి గిరాకీ లేకనో లేక అలనాటి దోమలు బొత్తిగా సాధుజీవులవడం వల్లనో రామలింగ కవి అట్నుంచీ నరుక్కొచ్చి కవిత్వం చదివి వుంటాడు. అదే ఈనాడైతే అదొక సమస్యగా మన ముందరకొచ్చి వుండేది కాదు.

దోమ ఆటంబాంబు లాంటిది. దాని పవర్ని కించపరిస్తే కళ్ళు రెండు పేలిపోతాయి. మనిషెంతటి వాడైనా కావచ్చు. చెయ్యెత్తు మనిషి ప్రకృతి శక్తులతో పోరాడే మేధావి. రెండొందల నలభై పౌన్ల బరువుగల శాల్తీ అంత మనిషినీ ఆవగింజంత దోమ ముద్దెట్టుకుందంటే తిరుగులేదింక. ఆఫ్టరాల్ మలేరియా ఫీవరేగదాని కొట్టిపారేస్తే కొట్టిపారేయవచ్చు. కాని కొన్ని జాతి దోమలున్నాయి. అవిగాని కుడితే ఆహా ఓహో అనుకునే పాదం అయ్యో పాపమైపోతుంది. బోదకాలితో నడవలేక అవస్థపడాలి. ఫేషను చెప్పులూ....బూట్లూ తొడుక్కోడానికి వీలుండదు. స్టైయిల్‌గా తిరిగేందుకు నోచుకోదు.

భాగ్యనగరంలో దోమల్ గూడా ఒక పేట. ఆ పేరు విన్నప్పుడల్లా అక్కడ దోమల విహారం ఎక్కువని నాకో డవుటుతోనే ఆ ప్రాంతంలో ఫస్టు క్లాసు ఇల్లు అద్దెకు దొరికితే వద్దు పొమ్మన్నాను. ఊరికి దూరంగా వుంటే దోమల బాధ వుండదనే ఉద్దేశ్యంతో బెజవాడ రోడ్డు పక్కన ఇంట్లో చేరాను. ఇప్పుడు తెలుస్తోంది. దోమల్‌గూడ దీనికంటే బెటరని. ఇక్కడ

దోమలు పరమ దుర్మార్గంగా వున్నాయి, రాత్రి పడితేచాలు దిగులు. తెల్లవార్లూ చప్పట్లే. మా యింట్లోనే కాదు చుట్టుపక్కల యిళ్ళన్నీ ఇట్లాగే ఏడుస్తున్నాయి. చప్పట్ల శబ్దం విని ఖవాలీ ఏదో జరుగుతూందని తెలియని వాళ్ళు అనుకుంటారేగాని దోమల్తో యుద్ధం చేస్తున్నామని అనుకోరు. చప్పట్ల మధ్య కొన్ని దోమలు ఛస్తాయి. కొన్ని మాత్రం మమ్మల్ని చంపుతాయి. చేతులు రెండూ రక్తం మరకలతో బీభత్సంగా వుంటాయి. నిద్ర లేమితో కళ్ళు ఎర్ర బడిపోతాయి. ఉదయమే నన్ను చూడటానికి వచ్చిన ఫ్రండ్స్ నా అవతారం చూసి బెదిరి పోవాల్సిందే. చేతుల్లో నెత్తురు మరకలూ, కళ్ళల్లో ఎర్రదనం చూస్తే రాత్రి నేనెవర్నో మర్డర్ చేసిన్నట్టు భావిస్తారని నేను సులువుగా గ్రహించగలను. చివరికి నన్ను ఖూనీకోరుగా చేసిన ఈ దోమలకు శిక్షేమిటి భగవాన్?